తాతల నాటి గొట్టాలే వ్యాధులకు చుట్టాలు

- పట్టణంలో 140 కి.మీ. పరిధిలో తాగునీటి పైపులైన్లు
- వాటిలో 50 నుంచి 60 కి.మీ. మేర ఐదు దశాబ్దాల క్రితం నాటివే
- వర్షాల వేళ రంగుమారిన నీరు వస్తోందంటూ ప్రజల ఆందోళన

అమలాపురం టౌన్: రాష్ట్రంలో పలు నగరాలు, పట్టణాల్లో డయేరియా జాడలు కనిపించడంతో పట్టణవాసుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా గతంలో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో రంగు మారిన నీరు పంపిణీ చేస్తున్నారంటూ స్వయంగా కౌన్సిలర్లే మున్సిపల్ సమావేశాల్లో గొంతెత్తిన పరిస్థితులున్నాయి. దీనికి తోడు మున్సిపల్ సిబ్బంది సార్వత్రిక ఎన్నికల సమయం నుంచి వాటర్ ట్యాంక్‌ల శుభ్రతను పట్టించుకోవడం మానేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పట్టణంలో డయేరియా, మలేరియా తదితర వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు.

- సరిగ్గా నాలుగు రోజుల క్రితం జరిగిన అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 21వ వార్డు కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి తమ వార్డులో పైపులైన్ల నుంచి రంగుమారిన నీళ్లు వస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పైపులైన్ల లీకేజీ వల్లే అలా జరిగి ఉండొచ్చని, పరిశీలించి సరిచేస్తామంటూ డీఈ నాగసతీష్ బదులిచ్చారు. పట్టణంలోని అనేక వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొందన్న మాట ప్రజల నుంచి వినిపిస్తుంది. ఇప్పటికీ దశాబ్దాల క్రితం నాటి పైపులైన్లు ఉండడం వల్ల ఎక్కడైనా అవి లీకైతే వర్షాలు వచ్చినపుడు రంగుమారిన నీళ్ల సరఫరా అవుతున్నట్లుగా ప్రజలు చెబుతున్నారు.


పట్టణంలో కుళాయిల నుంచి వచ్చే తాగునీటిని పరీక్షిస్తున్న వాటర్ వర్క్స్ సిబ్బంది


వాటర్ ఫిల్టర్ బెడ్స్ వద్ద తాగునీటి నాణ్యతను పరీక్షిస్తున్న కమిషనర్ మనోహర్

- అమలాపురం పట్టణంలో 30 వార్డులకు కలిపి దాదాపు 53,000 మంది నివసిస్తున్నారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. పట్టణ ప్రజల కోసం రోజుకి 4.50 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీలో మొత్తంగా 140 కిలోమీటర్ల పరిధిలో తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. వాటిలో 50 నుంచి 60 కిలోమీటర్ల మేర ఐదు దశాబ్దాలకు పైబడిన కాలం చెల్లిన పైపులైన్లే.. నిధుల లభ్యతను బట్టి ఆయా పైపులైన్లను మారుస్తూ వస్తున్నారు. ఇప్పుడిదే అంశం అందరినీ ఆందోళనకు గురి చేస్తుంది.
- ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు మున్సిపాలిటీలోని వాటర్ ట్యాంక్‌లను ఎన్నాళ్లకోసారి శుభ్రం చేస్తున్నారని ప్రశ్నించారు. వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదన్న వాదన వారి మాటల్లో ధ్వనించింది. ప్రధానంగా సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి మున్సిపల్ సిబ్బంది వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం మానేశారన్న చర్చ సాగుతోంది.

ఉరుకులు పరుగులు పెడుతున్న అధికారులు

పట్టణ ప్రజల్లో తాగునీటి నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతుండడం, రాష్ట్రంలోని పలు పట్టణాల్లో డయేరియా వ్యాపించడం, ప్రజాప్రతినిధులు సైతం తాగునీటి నాణ్యతపై అనుమానం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ పట్టణంలో తాగునీటి పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. వాటర్ వర్క్స్ విభాగంలోని నీటిని శుద్ధి చేసే ఫిల్టర్ బెడ్‌ల వద్ద కూడా నీటి నాణ్యతా ప్రమాణాలను ఆయన తనిఖీలు చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు.

> **తాగునీరు సురక్షితమే**
>
> పట్టణంలోని వాటర్ ఫిల్టర్ బెడ్స్ వద్దే కాకుండా క్షేత్ర స్థాయిలోని పలు కుళాయిల నుంచి వస్తున్న తాగునీటిపై పరీక్షలు నిర్వహించాం. మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీరు సురక్షితంగానే ఉంది. పొల్యూషన్ బోర్డు సిబ్బంది కూడా పట్టణంలోని తాగునీటిని పరీక్షించి బాగానే ఉందని ధ్రువీకరించారు. పట్టణంలోని వాటర్ ట్యాంక్‌లను కాల పరిమితి ప్రకారం శుభ్రం చేయిస్తున్నాం.
>
> – ఎస్.మనోహర్, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ


క్లుప్తంగా

దోమల నిర్మూలనకు ఫాగింగ్


పట్టణంలో ఫాగింగ్ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అమలాపురం టౌన్: పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా మున్సిపాలిటీ అధికారులు శని, ఆదివారాల్లో ఫాగింగ్ చేయించారు. గత కొంత కాలంగా మరమ్మతుల్లో ఉన్న ఫాగింగ్ మెషీన్లను బాగు చేయించడంతో పాటు మరో అధునాతన ఫాగింగ్ మెషీన్‌ను ఇటీవల కొనుగోలు చేశారు. ఫాగింగ్ మెషీన్లను ఓ ప్రత్యేక వాహనంలో ఉంచి పట్టణంలో అన్ని రోడ్లు, వీధుల్లో పొగ వదులుతూ దోమల నిర్మూలనకు చర్యలు చేపడుతున్నారు. పట్టణంలో కొన్ని రోజుల పాటు రోజూ సాయంత్రం వేళ ఫాగింగ్ మెషీన్లను వినియోగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ తెలిపారు.

ఘనంగా ఒనువులమ్మ తల్లి వార్షికోత్సవం


ఒనువులమ్మ అమ్మవారు

ముమ్మిడివరం: మండలంలోని సీహెచ్ గున్నేపల్లి ఒనువులమ్మవారి 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు.

వైస్ ఎంపీపీకి పలువురి పరామర్శ


నారాయణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు తదితరులు

ఉప్పలగుప్తం: పితృ వియోగంతో బాధపడుతున్న మండల వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావును ఆదివారం మునిపల్లిలోని ఆయన నివాసంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, స్థానిక సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు తండ్రి నారాయణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు పెట్టా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, కాట్రు కృష్ణ, నిమ్మకాయల హనుమంతు శ్రీనివాసరావు తదితరులున్నారు.

గురుకులంలో ఖాళీలకు దరఖాస్తుల స్వీకరణ

అల్లవరం: గోడిలోని బాలుర గురుకులంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్స్ పొందేందుకు బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు పాఠశాల ఆవరణలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. అడిష్మన్ కోరే విద్యార్థులు ఆధార్, పదవ తరగతి మార్కుల జాబితా, కులం, ఆదాయ ధ్రువపత్రాలతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

కొత్త సీఆర్పీసీ చట్టాలపై నేడు అవగాహన సదస్సు

యానాం: కేంద్ర ప్రభుత్వం జులై 1వ తేదీ నుంచి కొత్తగా ప్రవేశపెడుతున్న భారతీయ నాగరిక్ సురక్షా సన్‌హిత-2023 సీఆర్పీసీ చట్టాలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్పీ రాజశేఖరన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ), నేరశిక్షాస్మృతి, భారతీయ సాక్ష్యాధార చట్టం-1872 స్థానంలో వచ్చిన సీఆర్పీసీ చట్టాలు, వాటి అమలుపైన పలువురు మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో పోలీసులు, పోలీసు అధికారులు, మేధావులు, విద్యార్థులు పాల్గొంటారన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

అమలాపురం టౌన్: సామాజిక పింఛన్లను సోమవారం ఉదయం 6 గంటల నుంచి పట్టణంలోని 15 వార్డుల సచివాలయాల కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రంలోగా పట్టణంలో ఉన్న లబ్ధిదారులందరికీ పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించామన్నారు.

కవిత్వంపై యువత ఆసక్తి


కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి

అమలాపురం టౌన్: ఇటీవల కాలంలో కవిత్వంపై యువతలో ఆసక్తి పెరుగుతోందని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. స్థానిక గాంధీ నగర్‌లోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవిత్వ శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమంలో నరసింహమూర్తి మాట్లాడారు. ఇక నుంచి కవిత్వం ఎలా రాయాలి అనే అంశంపై యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం కవులు నరసింహమూర్తి, సత్యనారాయణలను గ్రంథాలయ పాఠకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, గ్రంథాలయ సహాయకుడు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, చిక్కాల రవిశంకర్, గున్నేపల్లి భీమశంకరం, బుర్ర కథా కళాకారుడు కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురువును ఎడ్ల బండిపై ఊరేగించారు


ప్రధానోపాధ్యాయుడు విశ్వేశ్వరరావును ఎడ్ల బండిపై ఊరేగిస్తున్న పూర్వ విద్యార్థులు


సూర్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న నాయకులు, రైతులు

ముమ్మిడివరం: మండలంలోని గేదెల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చేకూరి విశ్వేశ్వరరావు విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. హెచ్‌ఎంగా పదవీ విరమణ చేసిన విశ్వేశ్వరరావును పాఠశాల కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిలో విశ్వేశ్వరరావును కూర్చోబెట్టి పూర్వపు విద్యార్థులు, గ్రామస్తులు బండిని లాగుతూ గ్రామ మెయిన్ సెంటర్ నుంచి పాఠశాల వరకూ తీసుకొచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం జరిగిన అభినందన సభలో విశ్వేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కోలాబాబ్జీ, గుద్దటి జమి, గుద్దటి వీరాస్వామినాయుడు, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయన సేవలు ప్రశంసనీయం

తాళ్లరేవు: ఇరిగేషన్ కార్యాలయంలో డెల్టా లస్కర్‌గా 35 ఏళ్ల పాటు సేవలందించిన మీసాల సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయమని పలువురు అభినందించారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో సూర్యనారాయణ ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, రైతులు, ఇరిగేషన్ అధికారులు హాజరై సూర్యనారాయణ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ, తులసమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, తాళ్లరేవు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఇరిగేషన్ ఏఈలు ఈశ్వరరావు, నాగరాజు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, కృష్ణ త్రిమూర్తులు, టీవీవీ సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

811 కి.మీ. ప్రయాణం నిష్ఫలం

- పుదుచ్చేరిలో జరిగిన హోంగార్డు రాతపరీక్ష
- పది నిమిషాల ఆలస్యంతో పరీక్ష కేంద్రంలోకి దొరకని అనుమతి
- కన్నీటి పర్యంతమైన పలువురు యానాం అభ్యర్థులు


పుదుచ్చేరిలో పరీక్ష కేంద్రం గేటు వద్దే ఉండిపోయిన యానాం అభ్యర్థులు

యానాం: పుదుచ్చేరిలో ఆదివారం నిర్వహించిన హోంగార్డు రాతపరీక్షకు ఆలస్యంగా వెళ్లడంతో పలువురు యానాం అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు. ఇప్పటికే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష పాసైన పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్ల అభ్యర్థులకు ఆదివారం రాతపరీక్ష జరిగింది. ఈ నేపథ్యంలో యానాం నియోజకవర్గం నుంచి 332 మంది అభ్యర్థులు పరీక్ష రాయడానికి పుదుచ్చేరి వెళ్లారు. అయితే వారిలో పలువురు అభ్యర్థులు పది నిమిషాలు ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి వెళ్లడంతో అక్కడి సిబ్బంది వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. అభ్యర్థులు తాము దూరప్రాంతం యానాం నుంచి వచ్చామని దయచేసి తమను అనుమతించాలని అక్కడ సిబ్బందిని బతిమలాడినా ఫలితం లేకపోయింది. దీంతో పడిన కష్టమంతా వృథా అయిపోయిందంటూ పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

యానాంలో పరీక్ష కేంద్రం లేక

పుదుచ్చేరికి 811 కిలోమీటర్ల దూరంలో యానాం ఉంది. హోంగార్డు పరీక్షకు పుదుచ్చేరిలో పరీక్షా కేంద్రం ఇవ్వడంతో అభ్యర్థులంతా కాకినాడ, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి చెన్నై చేరుకుని అక్కడ నుంచి బస్సు మార్గంలో సుమారు 150 కిలోమీటర్లు బస్సులో ప్రయాణించి పుదుచ్చేరి చేరుకున్నారు. అయితే ప్రయాణంలో ఆలస్యం కావడం వల్ల పలువురు పరీక్షకు దూరమయ్యారు. ముందుగా పుదుచ్చేరికి చేరుకుంటే లాడ్జిలో ఉండటానికి వేలాది రూపాయలు ఖర్చు పెట్టలేక పరీక్ష రోజున అక్కడకు వెళ్లేలా ప్రయాణం పెట్టుకుంటున్నామని పలువురు అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పందించి పోటీ పరీక్షలను యానాంలోనే నిర్వహించేలా చూడాలని కోరుతున్నారు.

సంక్షేమ హాస్టళ్లకు నిధులు విడుదల చేయాలి

అమలాపురం టౌన్: పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లకు పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కొంకాపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను సీపీఎం జిల్లా బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా హాస్టల్‌లోని అనేక అసౌకర్యాలను గుర్తించిన పార్టీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరావు హాస్టల్ దుస్థితిపై ఓ ప్రకటన విడుదల చేశారు. కొంకాపల్లి హాస్టల్ భవనం పాతదై శిథిలావస్థకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. దోమల బెడదతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించామన్నారు. కిటికీలకు మెస్‌లు, బాత్‌ రూమ్‌లకు డోర్లు లేవన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి హాస్టల్ పురోభివృద్ధికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. హాస్టల్‌ను పరిశీలించిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్, పాలమూరి శ్రీనివాస్ తదితరులున్నారు.


హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు

రేషన్‌షాపులు త్వరితగతిన తెరవాలి

యానాం: ఏళ్ల తరబడి మూతపడిన రేషన్ షాపులను త్వరితగతిన తెరిచి ఉచిత బియ్యం పంపిణీ చేసేలా సీఎం రంగసామి చర్యలు తీసుకోవాలని మాజీ సీఎం నారాయణసామి డిమాండ్ చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన బియ్యం అందజేశారన్నారు. అయితే ఎల్జీగా కిరణ్ బేడీ వచ్చాక బియ్యానికి బదులుగా నగదు బదిలీ విధానాన్ని అమలు చేశారన్నారు. దీంతో పుదుచ్చేరిలో నాలుగు రీజియన్లలోనూ వందలాది రేషన్‌షాపులు మూతపడ్డాయన్నారు. దీనివల్ల ఆయా దుకాణాల్లో పనిచేసే సిబ్బందికి గత ఏడేళ్లుగా జీతాలు లేవన్నారు. ఇటీవల కేరళ, తమిళనాడు పోలీసులు స్వాధీనం చేసుకున్న గంధపు చెక్కల ప్రదేశం మంత్రి కుమారైకు చెందినదని, ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. తక్షణం ఆ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ ఎమ్మెల్యేలతో ఎల్జీ సమావేశం

యానాం: పుదుచ్చేరిలో అధికార ఎన్డీయే కూటమికి మద్దతిస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలతో ఎల్జీ రాధాకృష్ణన్ ఆదివారం రాజ్‌నివాస్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎల్జీతో సమావేశమైన వారిలో బీజేపీ ఎమ్మెల్యేలు కల్యాణసుందరం, జాన్‌కుమార్, రిచర్డ్, అశోక్‌బాబు, వెంకటేశన్, అంగళన్, శివశంకరన్ తదితరులున్నారు. ఈ సమావేశంలో సీఎం రంగసామి, మంత్రుల తీరుపై ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా సమాచారం. 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖతో పాలనాపరమైన విషయాలను చర్చించాలని పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు ఎల్జీని కోరినట్లు తెలుస్తుంది. పుదుచ్చేరిలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు ఉత్కంఠ కలిగిస్తున్నాయని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. లోక్‌సభ స్థానంలో కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా నిలిపిన హోంమంత్రి నమశ్శివాయం ఓటమి పాలవ్వడంతో బీజేపీ నేతల మధ్య విభేదాలు మొదలయ్యాయి.

ఇండియన్ క్రికెట్ టీమ్‌కు అభినందనలు


సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్‌రావు

అమలాపురం రూరల్: టీ 20 వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్‌లో విజయం సాధించిన ఇండియన్ టీమ్‌కు కోనసీమ జేఏసీ సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జేఏసీ కార్యాలయంలో కన్వీనర్ బండారు రామమోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఈ విజయం యువ క్రికెటర్లకు ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. సమావేశంలో జేఏసీ సభ్యులు డాక్టర్ మధుర నరసింహమూర్తి, నంద్యాల నాయుడు, టి.సుందర రామయ్య, కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ అభిమానుల సంబరాలు

అమలాపురం టౌన్: భారత జట్టు టీ 20 ప్రపంచ క్రికెట్ కప్‌ను కైవసం చేసుకోవడంతో స్థానిక గడియారం స్తంభం సెంటరులో క్రికెట్ అభిమానులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. జాతీయ జెండాలు చేతబట్టి కేక్‌ను కట్ చేసి హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. టీం ఇండియాకు శుభాకాంక్షలు తెలిపారు. క్రికెట్ అభిమానులు పిండి రాజా, యల్లమిల్లి నాగ సుధాకొండ, ఆకుల బుజ్జి, చింతపల్లి చిన్నా, కరీముల్లా, మహ్మద్ షరీఫ్, లింగోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే బురదమయం

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లి గ్రామంలో బొంతువారిపేటలో రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. బొంతువారిపేట నుంచి అమలాపురం పట్టణంలోకి వెళ్లాలంటే ఈ రోడ్డు మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. కాని వర్షం వచ్చిందంటే చాలు ఈ రోడ్డులో అడుగు పెట్టాలంటే భయం వేస్తుందని స్థానికులు వాపోతున్నారు. పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా తయారైందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కిడ్నీ బాధితుడికి ఆపన్న హస్తం


సేకరించిన మొత్తాన్ని బాధితుడు రాజు కుటుంబానికి అందజేస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: అనారోగ్యంతో ప్రాణాల కోసం పోరాడుతున్న వ్యక్తికి సహాయం అందించేందుకు పాతకోరంగి గ్రామస్తులు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన పలివెల కొండ, భాగ్యవతి దంపతుల కుమారుడు పలివెల రాజు(21) అనారోగ్యం పాలయ్యాడు. ఆసుపత్రిలో పరీక్ష చేయించుకుంటే రెండు కిడ్నీలు పాడయ్యాయని చెప్పడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో పడ్డారు. బాధితుడు పలివెల రాజు, అతడి తండ్రి కొండ ఇద్దరూ వ్యవసాయ కూలీలే. చికిత్స కోసం ఇబ్బంది పడుతున్న రాజుకు గ్రామస్తులు అండగా నిలబడ్డారు. ఊరంతా తలో చేయి వేసి రూ.1.46 లక్షలు సేకరించి ఆదివారం రాజు కుటుంబానికి అందజేశారు. వైద్యానికి మరింత సహాయం అవసరమని దాతలు ముందుకు రావాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సక్షమ్ వ్యవస్థాపక దినోత్సవం



దివ్యాంగులకు సేవ చేస్తున్న ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న సంఘం నాయకులు

అమలాపురం రూరల్: మండలంలోని ఈదరపల్లిలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో సమదృష్టి క్షమతా వికాసం అనుసంధాన్ మండలి(సక్షమ్) వ్యవస్థాపక దినోత్సవం డాక్టర్ సత్యప్రభ అధ్యక్షతన ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సక్షమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సక్షమ్ ద్వారా దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం దివ్యాంగ సంఘం నాయకులు నిమ్మకాయల సురేష్, మోటూరి వెంకటేశ్వరరావు, కొసన సుబ్రహ్మణ్యం, కె.నాగరాజు, పెనుమాల నాగరాజు, నల్లా నాయుడు, కాండ్రేగుల మణికంఠలతో పాటు ఉపాధ్యాయులను సంఘం కార్యదర్శి రాఘవేంద్ర సత్కరించారు.